గరుడ సేవకు వేళాయె..

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గరుడసేవను తిలకించేందుకు విచ్చేసే లక్షలాది మంది భక్తుల భక్తుల సౌకర్యార్థం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. దాదాపు 2 లక్షల మంది భక్తులు గ్యాలరీల్లో వేచి ఉండేలా చర్యలు తీసుకుంది. గరుడ సేవను రాత్రి 6.30 గంటలకు ప్రారంభించి భక్తులందరూ దర్శించుకునేలా అర్ధరాత్రి 2 గంటల వరకు సాగేలా ప్రణాళిక రూపొందించారు.ఉదయం 8 నుంచి రాత్రి ఒంటి గంట వరకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, 2.50 లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందించనున్నారు. ఏర్పాట్లు ఇలా.. **- తిరుమల**

- రాత్రి 6-30 గంటలకే వాహన సేవ ప్రారంభం
- గ్యాలరీల్లో నిరంతరాయంగా అన్నప్రసాదాలు
- ఎక్కువ మందికి దర్శనం కల్పించేందుకు గ్యాలరీల రీఫిల్లింగ్ ఏర్పాట్లు
- పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్లలో వేచి ఉండే భక్తులను సుపథం, సౌత్ వెస్ట్ కార్నర్, గోవింద నిలయం నార్త్ వెస్ట్ గేట్, నార్త్ ఈస్ట్ గేట్ల ద్వారా గ్యాలరీల్లోకి అనుమతిస్తారు.
- మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఉదయం 8 నుంచి రాత్రి ఒంటి గంట వరకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తారు.
- గ్యాలరీల్లోనూ ఉదయం నుంచి రాత్రి వరకు పులిహోర, టమాటా బాత్, బిసిబెళాబాత్ తదితర అన్నప్రసాదాల ప్యాకెట్లు, తాగునీటి అందజేస్తారు.
- అలిపిరి పాత చెక్ పాయింట్ వద్ద బైక్ పార్క్ చేసుకునే సదుపాయం కల్పించారు.
- వైద్యసేవల కోసం మాడవీధుల్లో మొబైల్ క్లినిక్‌లు, 7 అంబులెన్సులు, డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది నియమించారు.
- గడరు సేవను తిలకించేందుకు మాడ వీధులు, భక్తుల రద్దీగా ఉండే మ్యూజియం, వరాహ స్వామి విశ్రాంతి గృహం, అన్నదానం కాంప్లెక్స్, రాంభగీచా విశ్రాంతి గృహం, ఫిల్టర్ హౌస్ ఇతర ప్రాంతాల్లో కలిపి 20 పెద్ద డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేశారు.

భారీ భద్రతా ఏర్పాట్లు

గరుడసేవను తిలకించేందుకు గురువారం అత్యధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు టీటీడీ సీవీఎస్వో నరసింహ కిషోర్ తెలిపారు.

ఆర్టీసీ సన్నద్ధం

తిరుపతి అర్బన్: గరుడ సేవ సందర్భంగా గురువారం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను సిద్ధం చేసింది. సాధారణంగా రోజూ 240 సర్వీసులను నడుపుతోంది. గరుడ సేవ రోజున 340 సర్వీసులతో 6వేల ట్రిప్పులు నడిపి 2.20 లక్షల మందికి రవాణా సౌకర్యం కల్పించాలని ప్రణాళిక రూపొందించింది. దీంతో పాటు సాధారణంగా నడుస్తున్న 50 ఏసీ విద్యుత్ సర్వీసులు, రేణిగుంటకు నడుస్తున్న 14 ఏసీ విద్యుత్ సర్వీసులను తిరుమలకు కేటాయించారు.

క్షేత్రస్థాయికి 'సంక్షేమం'

- ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించండి
- ముఖ్యమంత్రి చేసిన మేలును తెలియజేయండి
- గృహ సారథులు, పార్టీ శ్రేణుల సమావేశంలో నేదురుమల్లి



టీడీపీ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు : నాలుగున్నరేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం రాపూరు సమీపంలోని తెలుగుగంగ అతిథి గృహంలో ఏపీకి వైనాట్ జగనన్న కార్యక్రమంపై గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సోషల్ మీడియా కమిటీ సభ్యులు, నేతలతో సమావేశం నిర్వహించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. దీనిపై సమష్టిగా పనిచేస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. జిల్లాలోని 7 నియోజకవర్గాలు గెలిపించాల్సిన బాధ్యత తనపై ఉందని, అందులో వెంకటగిరిలో అత్యధిక మెజార్టీ తీసుకురావాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

స్థానిక వాటర్‌ట్యాంక్, వెంకటేశ్వరపురం, మల్లమ్మగుంట, ఆంజనేయపురం ప్రాంతాల్లోని టీడీపీ చెందిన 30 కుటుంబాలు రామ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజాసేవే పరమావధి

మండలంలోని నెల్లేపల్లె పరిధిలోని తూమాయి, రేగడపల్లెలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, మండల కన్వీనర్ పాపకన్ను దయాకర్‌రెడ్డి, రాష్ట్రరైతు సంఘం కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి నాయకులు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, సర్పంచ్‌లు జయమ్మ, మోహన్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు



పార్టీలో చేరిన వారితో కలిసి జై జగన్ నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు : మండలంలోని అముడూరు పంచాయతీ వెంకటాపాళెం ఎస్టీ కాలనీలో బుధవారం సాయంత్రం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం సమక్షంలో 30 కుటుంబాలకు పైగా టీడీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. గాజుల అంకయ్య, శంకరయ్య, శంకరమ్మ, విజయ్, వెంకటయ్య, సుబ్బమ్మ, తుపాకుల రామచంద్రయ్య, కడూరు సుబ్బరామయ్య, అత్తూరు సుబ్రమణ్యం తదితర నేతలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు వెల్లడించారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ సుబ్బమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, నాయకులు పరమాల చంద్రశేఖర్, పెరుమాళ్, గోవిందరెడ్డి, మురళి పాల్గొన్నారు.

బస్సు ఢీకొని విద్యార్థి మృతి

తిరుచానూరు(చంద్రగిరి) : పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై అగ్రహారం సమీపంలో బుధవారం ఓ ప్రైవేటు కళాశాల బస్సు ఢీకొని విద్యార్థి మృతి చెందాడు. వివరాలు.. తిరుచానూరు పంచాయతీ చైతన్యపురానికి చెందిన సుబ్రమణ్యం కుమారుడు సంతోష్(16) ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. ద్విచక్రవాహనంపై వెళుతుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనీస వేతనాలు ఇవ్వకుంటే చర్యలు



వెంకటరమణకు స్వాగతం పలుకుతున్న డీసీఎల్

తిరుపతి రూరల్: వివిధ సంస్థలు, కర్మాగారాల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలను అందించడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం చూపితే చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి సభ్యులు మల్లిశెట్టి వెంకటరమణ హెచ్చరించారు. తిరుపతిలో రెండు రోజుల పర్యటనకు బుధవారం విచ్చేసిన ఆయనకు తిరుపతిలో కార్మికశాఖ జిల్లా ఉప కమిషనర్ బాలునాయక్ ఘనస్వాగతం పలికారు. కార్మికశాఖ సహాయ కమిషనర్ బీవీఎస్ కృష్ణారెడ్డి, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

పటిష్టమైన భద్రతా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీపీటీవో

తిరుపతి అర్బన్: గరుడోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన చాంబర్‌లో సెక్యూరిటీ సిబ్బందితో పాటు సేఫ్టీ డ్రైవింగ్ బోధకులతో సమావేశం అయ్యారు. సమష్టిగా పనిచేసి విజయవంతంగా గరుడోత్సవం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. సెక్యూరిటీ జిల్లా అధికారి ధర్మతేజ, ఆర్టీసీ డెప్యూటీ సీటీఎం భాస్కర్, మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, పర్సనల్ ఆఫీసర్ పార్థసారధి పాల్గొన్నారు.

వివిధ రాష్ట్రాల కళారూపాల సందడి

తిరుమల: నవరాత్రి బ్రహ్మోత్సవాలలో ఉదయం, రాత్రి వాహనసేవల్లో వివిధ రాష్ట్రాల కళారూపాల ప్రదర్శనకు భక్తుల నుండి విశేష ఆదరణ లభిస్తోంది. ప్రతి రోజూ ఒక్కో రాష్ట్రం నుండి కళాకారులు వారివారి సంప్రదాయ, జానపద కళారూపాలను ప్రదర్శిస్తున్నారు. అక్టోబర్ 19న విశేషమైన గరుడ సేవ నాడు దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు. బుధవారం సాయంత్రం తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ జేఈవో సదా భార్గవి ఆయా రాష్ట్రాల కళాబృందాల నాయకులతో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. తమిళనాడులోని ఫైన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ పూర్ణ పుష్కళ ట్రూప్ లీడర్‌లను పరిచయం చేశారు. ప్రదర్శనకు అవకాశం కల్పించడంతోపాటు వసతి, భోజన సౌకర్యాలు కల్పించినందుకు టీటీడీ యాజమాన్యానికి కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్వీ వేద వర్సిటీ వీసీ ఆచార్య రాణి సదాశివమూర్తి, ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రాం ఆఫీసర్ రాజగోపాల్, దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనంద తీర్థాచార్యులు, అన్ని రాష్ట్రాల టీమ్ లీడర్లు పాల్గొన్నారు.

గరుడ సేవలో ప్రత్యేక ప్రదర్శనలు

గరుడ సేవలో హర్యానా నుండి ఖోరియా, ఝుమర్, మణిపూర్ నుండి ఖంబా థోయిబి, మధ్య ప్రదేశ్ నుండి గూడుమ్ బాజా, బరేడీ నృత్య రూపాలు, పశ్చిమ బెంగాల్ నుండి బౌల్ డ్యాన్స్, అసోం నుండి బిహు, రాజస్థాన్ నుండి కల్బేలియా, ఘూమర్ నృత్యాలు, ఒడిశా నుండి సంబల్‌పురి నృత్యం, మహారాష్ట్ర నుండి లావణి, సోంగి ముఖోటా నృత్యాలు, తమిళనాడు నుండి నెమలి భరతనాట్యం, ఆంధ్రప్రదేశ్ నుండి కూచిపూడి, గరగలు, తెలంగాణ జానపద నత్యాలను ప్రదర్శిస్తారు.

రమణీయంగా శ్రీనివాస కల్యాణం

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో బుధవారం రాత్రి సురభి వినాయక నాటక మండలి వారు ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం పౌరాణిక పద్యనాటకం రమణీయంగా సాగింది. అన్నమాచార్య కళామందిరంలో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల బి.చిన్నమదేవి, ఎస్.ప్రసాద్ బృందం ప్రదర్శించిన భక్తి సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. శ్రీరామచంద్ర పుష్కరిణి కళా వేదికపై కళాకారులు వి.వేదనారాయణి, వి.సంధ్యశేఖర్ నృత్య ప్రదర్శన నయనానందకరంగా సాగింది.

అన్నపూర్ణగా గంగమ్మ

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మూడో రోజు బుధవారం అమ్మవారు శ్రీఅన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారిని శ్రీఅన్నపూర్ణదేవి అలంకరణలో కొలువు తీర్చి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, పాలక మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకామాక్షిదేవిగా...

కొత్త వీధిలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారు శ్రీకామాక్షిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సత్యనారాయణ, దిండుకుర్తి నరసింహులు,కోశాధికారి శిరీష మంజునాథ్ పాల్గొన్నారు.

చంద్రగిరి: గ్రామ దేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ అమ్మవారు బుధవారం సాయంత్రం శ్రీఅన్నపూర్ణ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ తిమ్మారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతే జగనన్న లక్ష్యం


- వైఎస్సార్‌సీపీ తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఎస్సీ నేతల సదస్సులో మంత్రి మేరుగు నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున. చిత్రంలో ఎస్సీ సెల్ నాయకుడు జూపూడి, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వరప్రసాద్ రావు తదితరులు

నెల్లూరు (దర్గామిట్ట): దళితుల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రమిస్తున్నారని మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. బుధవారం నెల్లూరులోని రవీంద్రనాథ్ ఠాగూర్ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఎస్సీసెల్ ముఖ్య నాయకులతో సామాజిక బస్సుయాత్ర విజయవంతంపై సమావేశం నిర్వహించారు. మంత్రి మేరుగు మాట్లాడుతూ చంద్రబాబు హయంలో దళితుల సంక్షేమానికి ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. పైగా ఎస్సీ కులంలో ఎవరైనా పుట్టాలని అనుకుంటారా అని చంద్రబాబు అవమానించారని మండిపడ్డారు. దళితులను అచ్చెన్నాయుడుతన్నిన ఘటనలు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖలో దళిత మహిళను వివస్త్రను చేస్తే చంద్రబాబు ఏ మాత్రం చలించలేదన్నారు. గుంటూరులో రవికుమార్ అనే ప్రభుత్వ ఉద్యోగిని చంపితే కేసు కూడా పెట్టనీయలేదని గుర్తుచేశారు. మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని జగనన్నకు ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ చీకటి ముసుగులో ప్రతిపక్షాలు ఉన్నాయని, వెలుతురుతో ప్రజల పక్షాన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ద్వారా దళితులకే ఎక్కువ మేలు చేకూరిందన్నారు. సామాజిక న్యాయ బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ దళితులంటే చంద్రబాబుకు చులకనని ఆరోపించారు. ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, బల్లి కల్యాణ్‌చక్రవర్తి, ప్రాంతీయ అధ్యక్షుడు దేవదానం, నల్లారి బాబు, దేవప్రసాద్, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు ఏసునాయుడు, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యం పెంచేలా బోధన



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంచేలా బోధన ఉండాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే–2023 నిర్వహణపై బ్లాక్ లెవెల్ కో- ఆర్డినేటర్లు, నోడల్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 3, 6, 9 తరగతుల్లోని విద్యార్థులకు భాషతోపాటు సబ్జెక్టుల్లో స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వేను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు మెయిన్ పరీక్షల కోసం విద్యార్థులకు మోడల్ ఎగ్జామ్ జరిపించాలని సూచించారు. తద్వారా విద్యార్థి ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నాడో గుర్తించి వారికి అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలని కోరారు. జిల్లాకు మంచి ర్యాంకు తీసుకువచ్చేందుకు ఎంఈఓలు కృషి చేయాలని స్పష్టం చేశారు. డీఈఓ శేఖర్ మాట్లాడుతూ ఈ మేరకు నవంబర్ 3వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు,ఎయిడెడ్ పాఠశాలల్లో ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్షలు జరపించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీవైఈఓ శివప్రసాద్ , డైట్ వైస్ ప్రిన్సిపల్ సుబ్రమణ్యంరాజు, డీసీఈబీ సెక్రెటరీ వంశీ రాజు, సర్వశిక్ష అభియాన్, సీఎంఓ సురేష్, శివ శంకరయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంప్రదాయ దుస్తుల్లో రష్యన్ భక్తులు


చీరకట్టులో విదేశీ మహిళలు

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం పలు దేశాల నుంచి నిత్యం భక్తులు వస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం శ్రీవారి దర్శనార్థం రష్యాకు చెందిన భక్తుల బృందం తిరుమలకు చేరుకుంది. 300 రూపాయల ప్రత్యేక దర్శనంలో స్వామివారిని దర్శించుకున్నారు. వీరంతా చీరను కట్టి, పంచె, దోవతీలు ధరించి, తిరునామాలతో భారతీయ సంప్రదాయంలో కనిపించారు. వీరితో ఫోటోలు దిగేందుకు ఆలయం వద్ద భక్తులు మక్కువ చూపారు.

ఆనందగిరి హుండీ ఆదాయం రూ.4,40,900

పాకాల: ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో హుండీ ద్వారా రూ.4,40,900 ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం హుండీ లెక్కింపులు చేసినట్లు తెలిపారు. ఆగస్టు 10 నుంచి అక్టోబర్ 17వ తేదీ వరకు ఆలయంలోని హుండీల ద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు వివరించారు. ఆలయం ఈఓ మునిశేఖర్, దేవదాయ శాఖ తనిఖీదారు ఫణిరాజశయన పాల్గొన్నారు.

ప్రణీత్‌కు బంగారు పతకం



తిరుపతి ఎడ్యుకేషన్: ఈ నెల 15నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రం, వరంగల్‌లో సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. పోటీల్లో తిరుపతి భారతీయ విద్యాభవన్ 9వ తరగతి విద్యార్థి బి.ప్రణీత్‌కుమార్ అండర్-14 షాట్‌పుట్‌లో బంగారు పతకం సాధించాడు. బుధవారం ఆ పాఠశాలలో విద్యార్థి ప్రణీత్ కుమార్, శిక్షణ ఇచ్చిన పీఈటీ పి.ప్రసాద్‌లను భవన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, ప్రిన్సిపల్ ఎ.వాణిశ్రీ అభినందించారు.

కవి సామ్రాట్‌కు ఘన నివాళి

తిరుపతి కల్చరల్: ఆర్‌ఎస్ మాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు బుధవారం ఘన నివాళులర్పించారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. ఆధ్యాత్మిక కేంద్రం నిర్వాహకుడు చిత్రపు హనుమంతరావు, సీఆర్‌కే.శేషగిరిరావు, బ్రాహ్మణ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉపనిషత్ సారమే నిజమైన విద్య


తిరుమల: అభయాన్ని, అమృతత్వాన్ని, ఆనందాన్ని శాశ్వతంగా ప్రసాదించేవి ఉపనిషత్తులని, వీటిని అందరూ అధ్యయనం చేయాలని రాష్ట్రపతి పురస్కార గ్రహీత ఆచార్య రామసూర్యనారాయణ తెలిపారు. తిరుమలలోని నాద నీరాజనం వేదికపై జరుగుతున్న శ్రీనివాస వేద విద్వత్ సదస్సులో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఉపనిషత్తుల సందేశం అనే అంశంపై ఉపన్యసించారు. తొలుత పండితులు వేద పారాయణం చేశారు. ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి ఆకెళ్ల విభీషణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దయే భక్తులకు రక్ష


ఉపన్యసిస్తున్న సముద్రాల శఠగోపాచార్య

తిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరుడికి ఉండే దయాగుణమే భక్తుల పాలిట గొప్పవరంగా భావించాలని ప్రముఖ సంస్కృత పండితులు, ధార్మిక సంప్రదాయ ప్రవచన కర్త సముద్రాల శఠగోపాచార్య పేర్కొన్నారు. తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం తిరుమల ఆస్థాన మండపంలో ఆళ్వార్‌దివ్య ప్రబంధ ప్రాజెక్టు, టీటీడీ తరపున ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో శ్రీవేదాంత దేశికులు రచించిన శ్రీ వేంకటేశ్వరుని దయా(గుణ) శతకంపై ఆయన ఉపన్యసించారు.

జగనన్నకే దళితుల మద్దతు


బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌ను సత్కరిస్తున్న దళిత నాయకులు

తిరుపతి మంగళం: దళితులంతా జగనన్నకే మద్దతుగా ఉంటారని తిరుపతి జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు నల్లాని బాబు తెలిపారు. బుధవారం నెల్లూరులో నిర్వహించిన ఎస్సీ ముఖ్య నాయకుల ప్రాంతీయ సదస్సు, సామాజిక న్యాయ బస్సుయాత్ర సన్నాహక సమావేశానికి తిరుపతి నుంచి నల్లాని బాబుతోపాటు అజయ్ కుమార్, దేవదానం, కుమార్ తదితరులు హాజరయ్యారు. సమావేశం అనంతరం బాపట్ల ఎంపీ, ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు నందిగం సురేష్‌ను కలిసి దుశ్శాలువాతో సత్కరించారు.

హిందూ ధర్మ జ్యోతులు.. శ్రీవారి సేవకులు

- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



సేవాసదన్‌లో శ్రీవారి సేవకులను ఉద్దేశించి మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, పాల్గొన్న శ్రీవారి సేవకులు

తిరుమల: శ్రీవారి సేవకులు తోటి భక్తులకు సేవలందిస్తూ నిస్వార్థ సేవలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారని, వీరిని సనాతన హిందూ ధర్మ జ్యోతులుగా టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకరరెడ్డి అభివర్ణించారు. తిరుమల శ్రీవారి సేవా సదన్ -2లో శ్రీవారి సేవకులను ఉద్దేశించి చైర్మన్ మాట్లాడుతూ టీటీడీ 23 ఏళ్ల కిందట కేవలం 200 మంది సేవకులతో శ్రీవారి సేవను ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం రోజుకు 2000 మందికి తక్కువ కాకుండా సేవలందిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 14 లక్షల మంది శ్రీవారి సేవకులు తిరుమల, తిరుపతిలో భక్తులకు సేవలందించారని వెల్లడించారు. శ్రీవారి భక్తులకు సేవ చేస్తూ స్వామివారి కీర్తిని దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తున్న సేవకులు ధన్యులన్నారు. నిస్వార్థ సేవలను కొనసాగించాలని, స్వచ్ఛంద సేవలో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. అంతకుముందు ప్రఖ్యాత గాయకులు శ్రీనిధి, పవన్ చరణ్ అన్నమాచార్య కృతులను అద్భుతంగా ఆలపించారు. అనంతరం గరుడసేవ కోసం ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా శ్రీవారి సేవకులకు ఆలయ విధులను టీటీడీ చైర్మన్ చేతుల మీదుగా కేటాయించారు. టీటీడీ పీఆర్వో టి.రవి, అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ డా.విభీషణ శర్మ, ఏపీఆర్వో కుమారి పి.నీలిమ, శ్రీవారి సేవ ఏఈవో రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ భక్తి పారవశ్యం

- గోవింద నామస్మరణతో మార్మోగిన తుమ్మలగుంట
- భక్తితో కీర్తించిన భజన బృందాలు
- మూడేళ్ల చిన్నారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి అభినందనలు



భజనలు చేస్తున్న ఐదేళ్ల దీక్షిత్, వాహనంపై వస్తున్న దేవదేవుడిని కీర్తిస్తున్న చిన్నారి


దీక్షిత్‌ను అభినందిస్తున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి

తిరుపతి రూరల్: శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల వేళ.. తుమ్మలగుంట క్షేత్రం భక్తుల గోవింద నామస్మరణ పులకిస్తోంది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో శ్రీవారు వివిధ అవతారాల్లో ఒక్కో వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తున్నారు. తిరుమల తరహాలో అంగరంగ వైభవంగా నిర్వహించే నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భజన బృందాలు భక్తితత్వంతో నర్తిస్తున్నాయి. చిన్నాపెద్ద తేడాలు లేకుండా చెక్కలు, కోలాటాలు చేతబట్టి భజనలతో స్వామివారిని కీర్తిస్తున్నారు. బ్రహ్మోత్సవాల ఆరంభం నుంచి భజన బృందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవడం, ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చేలా చిన్నారులు దేవతామూర్తుల కళారూపాలను ధరించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అతి చిన్న వయస్సులో భక్తితత్వాన్ని నింపేలా ఉత్సవాలను నిర్వహిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ముందుచూపునకు ప్రజలు ప్రశంసిస్తున్నారు.

ఐదేళ్ల దీక్షిత్‌కు ఎమ్మెల్యే చెవిరెడ్డి ప్రశంసలు

వెదురుకుప్పం మండలం మొండివెంగనపల్లికి చెందిన చిరంజీవిరెడ్డి, తేజ దంపతుల కుమారుడు దీక్షిత్‌రెడ్డి ఐదేళ్ల వయస్సులో చెక్కలు చేతబట్టుకుని భక్తి గీతాలను ఆలపిస్తూ పెద్దలతో సరిసమానంగా నాట్యం చేస్తూ స్వామివారిని కీర్తిస్తున్నాడు. ఇది గమనించిన చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చిన్నారిని అభినందించారు. తన ఒడిలో కూర్చోబెట్టుకుని భగవంతుని ఆశీస్సులు మెండుగా కలగాలని ఆశీర్వదించారు. ఆ పసి పాపడి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. కోలాటాలు, భక్తి గీతాలు ఆలపించే చిన్నారులతో పాటు భక్తుల నడుమ గోవింద నామ స్మరణలతో రెండు చేతులతో దండం పెట్టే పసిపాపలను ఆయన ప్రత్యేకంగా పలకరించారు. అతి చిన్న వయసులో బిడ్డల్లో భక్తిని పెంచిన ఆ పిల్లల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

అమ్మవారి పూజకు ఎమ్మెల్యే చెవిరెడ్డికి ఆహ్వానం


ప్రభుత్వ విప్ చెవిరెడ్డిని ఆహ్వానిస్తున్న దామినేటి కేశవులు

తిరుపతి రూరల్: శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా పేరూరు స్టాఫ్ క్వార్టర్స్ వద్ద వెలసిన శ్రీకరిమారియమ్మ నాగాలమ్మ అమ్మవారి పూజలో పాల్గొన్నాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఆలయ ధర్మకర్త, సర్పంచ్ దామినేటి కేశవులు ఆహ్వానించారు. బుధవారం తుమ్మలగుంటలో ఎమ్మెల్యే చెవిరెడ్డికి ఆహ్వాన పత్రికను అందించారు. అమ్మవారి 3వ శరన్నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు కేశవులు వివరించారు. అనంతరం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందించి, ఆహ్వానించారు.

ప్రసంగించడంపై ప్రత్యేక శిక్షణ

తిరుపతి కల్చరల్: నేటి యువత, విద్యార్థులు సమర్థవంతంగా మాట్లాడడం, బహిరంగంగా ప్రసంగించడం అంశాలపై యువతీ యువకులకు ఒక రోజు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు సెట్విన్ సీఈఓ డాక్టర్ వి.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంప్యాక్ట్ ఫౌండేషన్ ద్వారా ప్రతిభ కలిగిన రిసోర్స్ పర్సన్స్ ఈ శిక్షణ తరగతిలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 28వ తేదీన ఉదయం 9 గంటలకు పద్మావతిపురం, జిల్లా కలెక్టర్ కార్యాలయం, మీటింగ్ హాల్, తిరుపతి చిరునామాకు హాజరు కావాలని సీఈఓ కోరారు. మరిన్ని వివరాలకు 7036428762 సంప్రదించాలని కోరారు. లేదా సెట్విన్ మెయిల్ -ట్విన్ ఇజర్బుజీ .ఛొరు ద్వారా నమోదు చేసుకోవాలని తెలియజేశారు.

ప్రవీణ్ మృతికి ఎమ్మెల్యే చెవిరెడ్డి సంతాపం

చంద్రగిరి: చంద్రగిరి పాతపేటకు చెందిన ఆవులపల్లి ప్రవీణ్‌రెడ్డి(33) ఆకస్మిక మరణంపై చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలు బుధవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన


రెడ్ కార్పెట్ ప్రదర్శనలో సందర్శకుల సందడి

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డులోని పీఎల్‌ఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన రెడ్ కార్పెట్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు ఆర్‌కే.నాయుడు, శైలజారామ్ తెలిపారు. ఈ ప్రదర్శనలో దుస్తులు జ్యువెలరీ, హోమ్ డెకార్స్ తదితర సరికొత్త డిజైన్లతో కూడిన 40 స్టాల్స్ ఉన్నాయని తెలిపారు. గురువారం రాత్రి 9 గంటలకు ముగియనున్న ఈ రెడ్ కార్పెట్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్‌ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తిరుపతికి త్వరలో ఈట్ స్ట్రీట్

- కమిషనర్ హరిత


అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక తిరుపతి నగర ప్రజల కోసం త్వరలో ఈట్‌స్ట్రీట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత తెలిపారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌ను బుధవారం ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడంతోపాటు చిరు వ్యాపారులను ప్రోత్సహించేందుకు ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పరమాచార్య మార్గంను పరిశీలిస్తున్నామని అన్నారు. ఇక్కడ 30 నుండి 40 చిన్న షాపులు తాత్కాలికంగా ఏర్పాటు చేసి ప్రజలకు ప్రత్యేకమైన ఆహారపదార్థాలను అందించేలా చర్యలు చేపడుతామని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీసీపీ శ్రీనివాసులురెడ్డి, ఏసీపీ బాల సుబ్రహ్మణ్యం, డీఈఈ విజయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

చేగు ఆధ్వర్యంలో అన్నదానం


తిరువణ్ణామలైలో పేదలకు అన్నదానం

చంద్రగిరి: పాతపేటకు చెందిన వైఎస్‌ఆర్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు చేగు ప్రశాంత్ గుప్తా జన్మదిన వేడుకలు బుధవారం అట్టహాసంగా జరిగాయి. ఆయన తమిళనాడు తిరువణ్ణామలైలోని ఆలయ నాలుగు మాడ వీధుల్లో పేదలకు, పిల్లలకు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నదానం, బ్రెడ్లు పంపిణీ, మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం, భద్రాచలం ఏజెన్సీలో టీం చేగు సభ్యుడు ఉడిపి రాజు ఆధ్వర్యంలో గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చంద్రగిరి నాగయ్యగారిపల్లెలోని అరుణోదయ వృద్ధాశ్రమం, బెంగళూరులోని ఆడిసొండట్టిలోని సింఫోణి ఆశ్రమంలో అక్కడి సర్పంచ్ గౌరీష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతులకు, వృద్ధులకు అన్నదాన నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమోహన్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, శ్రీహరి రెడ్డి, నాగరాజు, ఉగ్రహణం గురుమూర్తిరెడ్డి, వినోద్, తేజు, సయ్యద్, బాషా, ప్రశాంత్, రామస్వామి పాల్గొన్నారు.

నూతన వధువుకి పెళ్లికానుక


వధువు మునిలక్ష్మికి ఎమ్మెల్యే చెవిరెడ్డి పంపిన పెళ్లికానుక అందజేస్తున్న నాయకులు

తిరుపతి మంగళం: చంద్రగిరి నియోజవర్గంలో నివాసం ఉంటూ వివాహం చేసుకునే నూతన వధూవరులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్, 2024 ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పెళ్లికానుక పంపడం ఆనవాయితీ. బుధవారం మంగళం రణధీర్‌పురం గ్రామ పంచాయతీలో వివాహం చేసుకుంటున్న పి.మునిలక్ష్మి అనే వధువుకి ఎమ్మెల్యే చెవిరెడ్డి పంపిన బంగారు తాళిబొట్టు, వెండిమెట్టెలు, పట్టువస్త్రాలు, శ్రీవారి లడ్డూప్రసాదం, శుభాకాంక్షలతో కూడిన గ్రీటింగ్ కార్డును ఆ పంచాయతీ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ మల్లె మొగ్గల ఉమాపతి, వార్డుమెంబర్లు మురళి, సతీష్, కయ్యాల భాస్కర్, సురేంద్ర, సోమశేఖర్‌రెడ్డి, చెంగల్‌రాయులు, ఏపీఆర్‌వో రెడ్డప్ప అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

చంద్రగిరి: ప్రతి పల్లెకు వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందని ఎంపీడీఓ రమేష్‌బాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం చంద్రగిరి సచివాలయం-3 పరిధిలోని ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్న చిన్న వ్యాధులకు డాక్టర్లు వైద్యసేవలను అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మరికొన్ని వ్యాధులకు ప్రత్యేకంగా రక్తపరీక్షలను నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. 479 మందికి పైగా ప్రజలు వైద్య సేవలను పొందినట్లు వైద్యాధికారులు తెలిపారు. సూపర్‌వైజర్‌లు నాగమణి, సుహాసిని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనుప్పల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

రామచంద్రాపురం: మండలంలోని అనుప్పల్లిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా స్పెషలిస్ట్ డాక్టర్లచే బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, స్పూటమ్ పరీక్షలతో పాటు జ్వరంతో బాధ పడుతున్న వారికి మలేరియా, డెంగీ తదితర 7 రకాల పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందిస్తున్నట్లు తెలిపారు. పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలకు అందించారు. సర్పంచ్ గోవర్ధన్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహన సేవలో ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి తదితరులు

తిరుమల: బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం కల్పవృక్ష వాహన సేవలో రెండు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి ఆవిష్కరించారు. మొల్ల రామాయణం (పరిమళ వ్యాఖ్యతో)-ఆచార్య కె.మళయవాసిని, విష్ణుపురాణం (కన్నడ)-డాక్టర్ సీఎస్ ఊర్మిళ పుస్తకానలు ఆవిష్కరించారు.

నేటి వాహన సేవలు

మోహినీ అవతారం

తిరుమల: బ్రహ్మోత్సవాలలో 5వ రోజు ఉదయం శ్రీవారు మోహినీరూపంలో శృంగారరసాధి దేవతగా భాసిస్తూ దర్శనమిస్తాడు. పక్కనే స్వామి దంతపు పల్లకిపై వెన్నముద్ద కృష్ణుడై మరో రూపంలో అభయమిస్తాడు.

గరుడ వాహనం

శ్రీవారి బ్రహ్మోత్సవాలలో 5వ రోజు రాత్రి గరుడవాహనంలో జగన్నాటక సూత్రధారియైన శ్రీ మలయప్ప స్వామివారు తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులందరికీ దర్శనమిస్తాడు.





